

అభివృద్ధి వైపు అడుగులు

● కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ ● బడుగు, బలహీన వర్గాలకు అభివృద్ధి ఫలాలు ● రూ.1031కోట్ల ఆస్తుల పంపిణీ ● ఆకట్టుకున్న కళాప్రదర్శనలు



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్

కడప ఎన్టీఆర్‌సర్కిల్/కడప క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో కన్నుల పండువగా ప్రారంభమైన 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జాతీయ జెండా పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌తో కలిసి మైదానంలో పెరేడ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టి అమలు చేస్తున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ ప్రజలకు సందేశమిచ్చారు. ఎందరో అమరవీరులు చేసిన త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్య లభించిందన్నారు. అయితే 1950 జనవరి 26వ తేది నుంచి రాజ్యాంగం అమలులోకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవాలు జరుపుకొంటున్నామన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లా స్థూల దేశ ఉత్పత్తి ప్రకారం రూ.57715 కోట్లు ఉందన్నారు. 2028-29 నాటికి జిల్లా స్థూల దేశ ఉత్పత్తి రూ.1,16,408 కోట్లకు చేరుకునేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు.



జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.2,09,102

జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.2,09,102గా ఉందని, 2028-29 నాటికి రూ.4,46,034కు చేరుకునేలా విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. రాబోయే ఐదేళ్లకు జిల్లా వృద్ధి రేటును ప్రతి సంవత్సరం 15 శాతం పెంపుదల దిశగా ముందుకెళ్తున్నామన్నారు. జిల్లాలోని 11 ప్రాజెక్టులలో గరిష్ట స్థాయి నీటిమట్టం 77.285 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 56.060 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. ఈ రబీ సీజన్‌లో జిల్లాలో సాధారణ విస్తీర్ణం 1,42,988 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 1,01,244 హెక్టార్లలో పంటలు సాగు చేసినట్లు తెలిపారు. రూ.13.29 కోట్లతో పంటల బీమా నమోదు చేయించి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచామన్నారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు వ్యవసాయ రంగం కింద రూ.8353 కోట్ల పంట రుణాలు లక్ష్యం కాగా రూ.10995కోట్లు మంజూరు చేశామని వివరించారు. రైతులు పండించిన పంటలకు కనీస గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని, రైతు దిగుబడులను నిల్వ చేసుకునేందుకు అదనంగా మరో పద కొండు గోదాములు నిర్మాణంలో ఉన్నాయన్నారు.

పాడిరైతులను ఆదుకునేందుకు..

అలాగే పాడిరైతులను ఆదుకునేందుకు.. చంద్రన్న సంచార పశువైద్య సేవ పథకంలో 13 సంచార అంబులెన్సు ద్వారా 69,221 పశువులకు వైద్యసేవలు అందించినట్లు చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీతో జిల్లాలో 875 మినీగోకులాలను, మత్స్యకారులకు జీవనోపాధులు కల్పించడం కోసం చేపల ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు వివిధ రకాల అర్హులందరికి ప్రతినెల 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా సామాజికంగా బలోపేతం చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు రూ.594.35 కోట్ల రుణాన్ని అందించినట్లు తెలిపారు. ఉన్నతి పథకం ద్వారా 1237 మంది సభ్యులకు రూ.7.5 కోట్లు వడ్డీలేని రుణాలు ఇచ్చామన్నారు. మహిళా శిశు అభివృద్ధిలో భాగంగా గర్భవతులు, బాలింతలు చిన్నారులకు ప్రతి నెల బాల సంజీవిని కిట్లను అందిస్తున్నట్లు చెప్పారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా జిల్లాలోని 2007 స్కూల్‌లో 1,28,186 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, అదేవిధంగా ఈ ఏడాది జనవరి 4 నుంచి జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 5073 మంది విద్యార్థులు కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 3,32,429 సిలిండర్లను పంపిణీ చేసి రూ.25.82 కోట్లు సబ్సిడీ ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. జిల్లాలోని 11 ఇసుక రీచ్‌లలో 8,20,391 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉండగా ఇప్పటి వరకు 2,74,257 మెట్రిక్ టన్నుల ఇసుకను వినియోగదారులకు ఉచితంగా సరఫరా చేసినట్లు చెప్పారు. జిల్లాలోని పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. పేద ప్రజలకు రూ.5కే రుచికరమైన భోజనాన్ని అందించేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నామన్నారు. భూ సమస్యలు పరిష్కరించేందుకు 702 రెవి న్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని పరిష్కరిస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర సాధనలో భాగంగా ప్రతి నెల మూడో శనివారాన్ని స్వచ్ఛ దివస్‌గా ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, వివిధ జిల్లా ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పలు శకటాల ప్రదర్శన

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వివిధ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన సాగింది. సీపీఓ, డీఆర్‌డీఏ, ఎల్‌డీఎం, చీఫ్ మేనేజర్, ఎస్‌బీఐ, పీడీ హౌసింగ్, జీఎం డీఐసీ (పరిశ్రమల శాఖ) జిల్లా పర్యాటక శాఖ, జిల్లా విద్యాశాఖ, పీఓ సమగ్ర శిక్ష, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్, పీడీ మహిళ, స్త్రీ శిశుసంక్షేమ, జిల్లా వైద్య ఆరోగ్య, డీసీహెచ్‌ఎస్, జలవనరుల, అటవీ, జిల్లా వ్యవసాయ, డీడీ మత్స్య, జిల్లా పశుసంవర్థక శాఖలు, జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈఓ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి పారుదల శాఖ, జిల్లా నీటి యాజమాన్యం సంస్థ, విద్యుత్, ఉద్యాన, ఏపీఎంఐపీ, కమీషనర్, మున్సిపల్ కార్పొరేషన్, కడప, పోలీస్ శాఖ (వజ్ర వాహనం), జిల్లా అగ్నిమాపక శాఖ (మిస్ట్ బుల్లెట్స్, మిస్ట్ వెహికల్ అండ్ ఫర్ టెండరర్) శకటాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఈ ప్రదర్శనలో డీపీఓ, జడ్పీ, పీఆర్ ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా నీటి యాజమాన్య సంస్థలకు మొదటి బహుమతి, వ్యవసాయం, మత్స్యశాఖ, పశుసంవర్థక శాఖలకు రెండవ బహుమతి లభించింది. మూడో బహుమతి కడప మున్సిపల్ కార్పొరేషన్‌కు లభించింది. ప్రోత్సాహక బహుమతిగా సీపీఓ, డీఆర్‌డీఏ, హౌసింగ్, ఎల్డీఎం, ఎస్‌బీఐలకు లభించింది.

ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వ శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు.

రూ.1031.12 కోట్ల ఆస్తుల పంపిణీ

గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని 10,712 యూనిట్లకు సంబంధించి 95,494 మంది లబ్ధిదారులకు రూ.1031.12 కోట్ల ఆస్తులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్ సంబంధిత అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఇందులో డీఆర్‌డీఏ ద్వారా బ్యాంకు లింకేజీ కింద 48,730 మంది లబ్ధిదారులకు రూ.419.19 కోట్లు, స్త్రీనిధి కింద 11326మంది లబ్ధిదారులకు రూ.73.26 కోట్లు, మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీ కింద 35410మందికి రూ.537.87 కోట్లు, విభిన్న ప్రతిభావంతుల సంస్థ ద్వారా నేషనల్ హ్యాండీక్రాఫ్ట్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద ఐదు మంది లబ్ధిదారులకు రూ.0.25 కోట్లు, ల్యాప్‌టాప్‌ల పథకం కింద 11 మందికి రూ.0.33 కోట్లు, బ్యాటరీ ఆపరేటర్ ట్రైసైకిల్స్ పథకం కింద నలుగురికి రూ.0.18 కోట్లు, చెవిటి మిషన్ల పథకం కింద ఎనిమిది మందికి రూ.0.04 కోట్లు.

స్వాతంత్ర్య సమరయోధులకు ఘన సత్కారం

76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌లతో కలిసి స్వాతంత్ర్య సమరయోధులు చెన్నూరు మండలానికి చెందిన పెడబల్లి బాలయల్లారెడ్డి కోడలు అరుణాదేవి, అదే మండలానికి చెందిన కీ.శే. బుడ్డారెడ్డిగారి శేషారెడ్డి కోడలు రమాదేవి, ఊటుకూరు గ్రామం సీకేదిన్నె మండలానికి చెందిన కీ.శే. వేల్పుల సుబ్బయ్య గారి సతీమణి వి.నారాయణమ్మ, పులివెందుల మండలానికి చెందిన కీ.శే. అశ్వర్థరెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, ముసల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన కీ.శే. సింగం శివారెడ్డి కుమారుడు సింగం జగన్‌మోహన్‌రెడ్డి, కొత్తపల్లె గ్రామం సింహాద్రిపురం మండలానికి చెందిన బాలిరెడ్డి కుమారుడు శివశంకర్, కడప మండలానికి చెందిన ఎల్.సంజీవరెడ్డి కుమారుడు ఎల్.ప్రభావతమ్మ, లింగాల మండలానికి చెందిన పిల్లా వెంకటరామిరెడ్డి, కోడలు కమలమ్మ, కడప మండలానికి చెందిన వల్లెపు వెంకటసుబ్బయ్య కుమారుడు రఘురామిమూర్తి, ఎర్రగుట్ల మండలం చిలమకూరుకు చెందిన పక్కీరప్ప కుమారుడు శరత్ బాబులను ఘనంగా సత్కరించారు.

మార్చ్‌ఫాస్ట్ ప్రదర్శన

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మార్చ్‌ఫాస్ట్ ప్రదర్శనలో మొదటి బహుమతిగా ఎన్‌సీసీ 7ప్లాటూన్‌కు లభించింది. రెండవ బహుమతి సివిల్ పోలీస్-3కి లభించింది. మూడవ బహుమతిగా హోంగార్డు టీంకు లభించింది. ప్రోత్సాహక బహుమతిగా బ్యాండ్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లకు లభించింది.

సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన

మొదటి బహుమతిగా హ్యాపీ కిడ్స్ స్కూల్, కడపకు లభించింది. రెండవ బహుమతిగా ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ కడపకు లభించింది. మూడవ బహుమతిగా మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ కడపకు లభించింది. ప్రో త్సాహక బహుమతిగా జడ్పీ హైస్కూల్, శెట్టివారిపల్లె, మైదుకూరుకు లభించింది.





ఆకట్టుకున్న అన్నా క్యాంటీన్ శకటం







వేదికపై ఆశీనులైన కలెక్టర్, జేసీ, ఎస్పీ



పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు



అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..

● రేపు కడప, ప్రొద్దుటూరులో ఆంధ్రజ్యోతి కార్యక్రమం
● కడపలో మేయర్ సురేశ్‌బాబు.. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

కడప, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మా అక్షరం మీ ఆయుధం నినాదంతో దశాబ్దాలుగా బాధితుల పక్షాన నిలుస్తున్న ఆంధ్రజ్యోతి ఇప్పుడు ప్రజల సమస్యల పరిష్కారం దిశగా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు వార్తలుగా మలచి వెలుగులోకి తీసుకువస్తున్న ఆంధ్రజ్యోతి, మరొక అడుగు ముందుకు వేసి ఆచరణాత్మక కార్యక్రమం ప్రారంభిస్తోంది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' పేరుతో ఆయా ప్రాంతాల్లో నెలకొని ఉన్న సమస్యల్ని అక్కడి ప్రజలు ప్రజాప్రతినిధులతోనూ, అధికారులతోనూ నివేదించుకునేందుకు ఒక వేదికగా మారుతోంది. నాయకులూ, అధికారులను ప్రజల వద్దకే తీసుకువచ్చి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తోంది.

కడప, ప్రొద్దుటూరులో..

కడపలోని అశోక్‌నగర్‌లో గల సచివాలయం-2లో మంగళవారం ఉదయం 11 గంటలకు 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం జరుగుతుంది. సమావేశానికి కడప కార్పొరేషన్ మేయర్ సురేశ్‌బాబు, కార్పొరేటర్ బండి జయమ్మ, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ప్రొద్దుటూరులోని హనుమాన్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం జరుగుతుంది. సమావేశానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, కౌన్సిలర్ అనిల్, తహసీల్దార్ గంగయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు హాజరవుతున్నారు. కాగా కడపలోని అశోక్‌నగర్, ప్రొద్దుటూరులోని హనుమాన్‌నగర్ ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశంలో ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లవచ్చు. ఆ ప్రాంతంలోని సమస్యలను ఆంధ్రజ్యోతి ప్రతినిధులు ఇప్పటికే గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు లేవని ప్రజలు చెబుతున్నారు. ప్రజాప్రతినిధుల సూచనలతో వీటి పరిష్కారానికి ఉన్న అవకాశాలను అధికారులు ఈ సమావేశంలో పరిశీలించి ప్రజలకు వివరిస్తారు.

ట్రిపుల్ఐటీలో క్యాంటీన్ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

● రెండు క్యాంటీన్లు డ్వాక్రా గ్రూపులకు కేటాయింపు ● త్వరలోనే ప్రారంభం

వేంపల్లె, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రాజకీయ ఒత్తిళ్లను అధిగమించి ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో క్యాంటీన్ల ఏర్పాటుకు అధికార యంత్రాంగం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూడు క్యాంటీన్ల ఏర్పాటుకు ట్రిపుల్ఐటీ నుంచి ప్రతిపాదనలు పోగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ అధికారులు రెండు క్యాంటీన్లను డ్వాక్రా గ్రూపులకు కేటాయించారు. ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో కొత్తక్యాంపస్‌లో సుమారు ఆరువేల మందికి పైగా విద్యార్థులు, పాత క్యాంపస్‌లో రెండువేల మంది దాకా ఒంగోలు ట్రిపుల్ఐటీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులు క్యాంటీన్లు లేక బయట ఫుడ్ కోసం ఎగబడేవారు. దీంతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త క్యాంటీన్లను కేటాయించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరికి నివేదించారు. అయితే టీడీపీలో ఉన్న ప్రధాన నాయకుల ఆధిపత్య పోరుకు తోడు వైసీపీ నుంచి ముఖ్యనాయకుడి ఒత్తిడి ఉండడం వల్ల కొత్త క్యాంటీన్లను కేటాయించడంలో తీవ్ర జాప్యం జరుగుతూ వచ్చింది. కాగా ఎట్టకేలకు వేంపల్లెకు చెందిన శ్రీనివాస డ్వాక్రా గ్రూపు, చక్రాయపేటకు చెందిన సాయిబాబా డ్వాక్రా గ్రూపులకు రెండు క్యాంటీన్లను కేటాయిస్తూ డీఆర్‌డీఏ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. బాలుర హాస్టల్‌లో ఒకటి, బాలికల హాస్టల్‌లో మరొకటి క్యాంటీన్లు మంజూరయ్యాయని ఏఓ రవికుమార్ తెలిపారు. క్యాంటీన్లకు సంబంధించి మంజూరైన వారు అగ్రిమెంట్ చేసుకొని త్వరలోనే ప్రారంభిస్తారని తెలిపారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాచమల్లుకు డ్రగ్స్ మాఫియాతో సంబంధాలు

● ఉనికి కోసమే వరదపై అసత్య ఆరోపణలు ● విలేకర్లతో ప్రొద్దుటూరు టీడీపీ నేతలు

ప్రొద్దుటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆయన బావమరిది బంగారురెడ్డిలకు డ్రగ్స్ మాఫియాతో సంబంధాలున్నాయని టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యం రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అనుచరులుగా వుండే కాలేజీ రోడ్డుకు చెందిన క్రికెట్ బుకీ అక్రమ్ టీంలో హనీఫ్, చాంద్‌పీర్‌లు వున్నారన్నారు. హనీఫ్‌తో మాజీ ఎమ్మెల్యే రాచమల్లుకు, బంగారురెడ్డికి సంబంధాలున్నాయన్నారు. హనీఫ్ ఇటీవల కాలంలో డ్రగ్స్ కేసులో అరెస్టు అయి హైదరాబాదు చెంచల్‌గూడ జైల్లో వున్నాడని, పోలీసుల విచారణలో ప్రొద్దుటూరులో కూడా డ్రగ్స్ వ్యాపారం చేశాడని ఒప్పుకున్నాడన్నారు. కాగా చాంద్‌పీర్ అనే వ్యక్తి పోలీసులకు దొరక్కుండా ముంబైకి పరారయ్యాడని ఆరోపించారు. ఇదిలా ఉండగా దమ్ముంటే 'మీ కుటుంబం నందం సుబ్బయ్యను హత్య చేయలేదని సీబీఐ విచారణ ఎందుకు కోరలేదని' రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి సవాల్ విసిరారు. జార్జి క్లబ్ మీద అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఇచ్చిన తీర్పు మేరకు నడుచుకోవాలని హితవు పలికారు. సమావేశంలో సర్పంచ్ శివచంద్రారెడ్డి, పగిడాల దస్తగిరి, మాజీ కౌన్సిలర్లు అమీర్‌బాషా రామాంజనేయ రెడ్డి, జనసేన మురళి పాల్గొన్నారు.



డ్రగ్స్ మాఫియాతో సంబంధాలపై ఫొటోలను చూపిస్తున్న టీడీపీ నేతలు

డీటీసీ సస్పెన్షన్

కడప, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కడప డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పనిచేస్తున్న ఎ.చంద్రశేకర్‌రెడ్డిని ఎట్టకేలకు ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కడప డీటీసీగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి మహిళ ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవారు. రెండురోజుల క్రితం కార్యాలయంలోనే ఆయనకు దేహశుద్ధి చేశారు. మహిళా ఉద్యోగి పట్ల ఆయన వ్యవహారం సంచలనమైంది. చివరికి రవాణాశాఖ ప్రిన్సిపల్ కాంతిలాల్ దండే డీటీసీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

న్యాయస్థానాల గౌరవాన్ని
మరింతగా పెంపొందించాలి

● జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాల పట్ల మరింతగా గౌరవాన్ని పెంపొందించి తద్వారా గణతంత్ర దినోత్సవ ఫలాలను విస్తరింపజేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి పేర్కొన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం జిల్లా కోర్టులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ భారతదేశానికి మూడు జాతీయ పండుగలలో రిపబ్లిక్ దినోత్సవం ఒకటన్నారు. మనదేశ రాజ్యాంగం 1950 జనవరి 26న అమలు పరచి గణతంత్ర దేశంగా ప్రకటించుకుని జాతీయ పండుగగా జరుపుకుంటున్నామన్నారు. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశానికి రాజ్యాంగం తయారు చేయడానికి రాజ్యాంగ పరిషత్ ఏర్పడిందని, 1947 ఆగస్టు 29న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్మన్‌గా రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఏర్పడిందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా గుర్తించబడిందని, అలా తయారైన రాజ్యాంగాన్ని 1950 జనవరి 26 నుంచి అమలు పరిచడంతో భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగా రూపొందిందన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు, నాల్గవ అదనపు, ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తులు ఎల్.వెంకటేశ్వరరావు, జి.దీనబాబు, షేక్ ఇంతియాజ్ అహమ్మద్, డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్, జడ్జిలు ప్రవీన్‌కుమార్, కె.ప్రత్యూషకుమారి, జె.హేమశ్రవంతి, కడప బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బి.గుర్రప్పనాయుడు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మహనీయులకు నివాళులు అర్పిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కడపలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది



విశ్వేశ్వరనాయుడు, డీఆర్ఓ, కడప
వెండిపతకం, ప్రశంసాపత్రం అందుకుంటున్న విజయలక్ష్మి
జాన్ ఇర్విన్, కడప ఆర్డీఓ
చంద్రమోహన్, ఆర్డీఓ, బద్వేల్
సాయిశ్రీ ఆర్డీఓ, జమ్మలమడుగు
చిన్నయ్య ఆర్డీఓ, పులివెందుల
వెంకటపతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
ఓబులమ్మ, జడ్పీ సీఈఓ
ఆనందనాయక్, డీఆర్‌డీఏ పీడీ



ఆదిశేషారెడ్డి, డ్వామా పీడీ
ఎ.నాగేశ్వరరావు, డీఏఓ
రాజ్యలక్ష్మి డీపీఓ
నాగరాజు, డీఎంహెచ్ఓ
శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ
వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ
విజయలక్ష్మి, ఆత్మ పీడీ
రాజారత్నం, హౌసింగ్ పీడీ
చాంద్‌బాషా, పరిశ్రమల శాఖ
వై.సురేష్‌రెడ్డి, మెప్మా పీడీ
సరస్వతి, డీడీ సోషల్ వెల్ఫేర్



చాముండేశ్వరి, డీఎస్ఓ
ఎ.సురేష్, ఉపాధి అధికారి
పరిమళ జ్యోతి మార్క్‌ఫెడ్
బ్రహ్మయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ
జయసింహా, బీసీ కార్పొరేషన్ ఈడీ
సి.సాయిగ్రేస్, స్టెప్ సీఈఓ
మనోజ్‌రెడ్డి, కడప కమిషనర్
జీవన్‌చంద్రశేఖర్, సూపరింటెండెంట్ కలెక్టరేట్
ఎ.శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
బి.శివరామిరెడ్డి, తహసీల్దార్, కమలాపురం
గంగయ్య, తహసీల్దార్ ప్రొద్దుటూరు



నాగేశ్వరరావు, తహసీల్దార్, సీకేదిన్నె
రాజేంద్రప్రసాద్, మైదుకూరు డీఎస్పీ
వెంకటేశ్వర్లు, జమ్మలమడుగు డీఎస్పీ
వినయ్‌కుమార్‌రెడ్డి, సీఐ, డీసీఆర్‌బీ
ఉలసయ్య, సీఐ, ఆర్‌కే వ్యాలీ
నాగభూషణం, సీఐ, బద్వేలు రూరల్
మధుమల్లేశ్వర్‌రెడ్డి, సైబర్ సెల్
సీతారామిరెడ్డి, సీఐ, రిమ్స్
శివశంకరనాయక్, సీఐ, సీకేదిన్నె
ఎంవీ ప్రభాకర్‌రావు, సహకార శాఖ అధికారి
ధనుంజయ, డీఆర్‌డీఏ, కడప

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాయచోటిలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది



మేఘస్వరూప్, సబ్ కలెక్టర్, మదనపల్లె
నిదియాదేవి, సబ్‌కలెక్టర్, రాజంపేట
ఎ.శ్రీనివాస్, ఆర్డీవో, రాయచోటి
ఎస్.రమ హెచ్ఎన్ఎస్ఎస్, పీలేరు
అనిల్‌కుమార్ ఫైర్ ఆఫీసర్
భరత్‌కుమార్ సర్వే ఏడీ
వెంకటరత్నం పీడీ, డ్వామా
టి.తేజస్విని, ఏడీ, ట్రైబల్ వెల్ఫేర్



దయాకర్‌రెడ్డి ఎస్ఈ, పీఆర్
భరత్, ఎస్ఈ ఇరిగేషన్
మధుసూదన్‌రావు డీఆర్‌వో
సీహెచ్ పురుషోత్తం డీపీఆర్‌వో
కృష్ణారావు ఇండస్ట్రియల్ ఆఫీసర్
సుబ్రహ్మణ్యం ఏడీ, మైనింగ్
జి.ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్
పి.రాము ఆర్ఎం, ఆర్టీసీ
నాగభూషణం ఏడీ, టూరిజం
ఆంజనేయులు ఎల్డీఎం
జవహర్‌బాబు ఎంపీడీవో, గాలివీడు



చంద్రానాయక్ జేడీ, అగ్రికల్చర్
భరత్‌కుమార్‌రెడ్డి డీఈ ఐఅండ్‌పీఆర్
రవిచంద్ర ఏడీ, హార్టికల్చర్
నాగభూషణం ఏవో, కలెక్టరేట్
విశ్వనాథ్ ఏడీ, ఎండోమెంట్
నరసింహకుమార్ సూపరింటెండెంట్, కోఆర్డినేషన్
సహదేవరెడ్డి ఎస్ఈ, ఆర్అండ్‌బీ
ఖలందర్ కలెక్టర్ సీసీ
రవి, వీడియోగ్రాఫర్ ఐఅండ్‌పీఆర్
ద్రోణాచరణ్ ఫొటోగ్రాఫర్, ఐఅండ్‌పీఆర్
రాజారమేష్ ఎస్‌బి సీఐ



కృష్ణమోహన్ డీఎస్పీ, రాయచోటి
చంద్రశేఖర్ సీఐ
కొండారెడ్డి సీఐ, లక్కిరెడ్డిపల్లె
నరసింహారెడ్డి, ఎస్ఐ, రాయచోటి అర్బన్
వరప్రసాద్, సీఐ, రాయచోటి రూరల్
జావీద్, ఎస్ఐ, రాయచోటి అర్బన్
పీర్‌మున్నీ తహసీల్దార్, రాజంపేట
రామాంజనేయులు తహసీల్దార్, రామాపురం
నిర్మలాదేవి, తహసీల్దార్, రామసముద్రం
ధనంజేయులు తహసీల్దార్, నిమ్మనపల్లె
సైకం వంశీ డీటీ, రాయచోటి

కన్నుల పండువగా అట్ హోమ్

కడప కలెక్టరేట్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని స్థానిక కలెక్టరేట్ బంగ్లా ప్రాంగణంలో ఆదివారం అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో కన్నుల పండువగా అట్ హోమ్ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ శ్రీధర్ ఏర్పాటు చేసిన తేనీటి విందులో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, నగరపాలక కమిషనరు మనోజ్‌కుమార్‌రెడ్డి, కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ, ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డిలు పాల్గొనగా వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. అనంతరం జిల్లా టూరిజం అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా పురప్రజలకు, వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన కళాకారులకు 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రాచీన కళలైన జానపదాలు, భరత నాట్యాలు, జాతీయ భక్తిగీతాలు అట్ హోమ్ కార్యక్రమంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ఐక్యంగా కృషి చేద్దామన్నారు. విధులు, బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి రాష్ట్ర అభివృద్ధిలో వైఎస్సార్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి అధికారులను, వారి కుటుంబ సభ్యులను పలకరించి పరిచయం చేసుకున్నారు. తదనంతరం కళాకారులందరికీ కలెక్టర్, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా మెమెంటోలను అందజేశారు. అట్ హోమ్ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వారి కుటుంబ సభ్యులతో కలసి పాల్గొని ఉల్లాసంగా గడిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అందరినీ ఆకట్టుకున్న వ్యవసాయ, మత్స్యశాఖ శకటం

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ స్కూల్ పాఠశాల విద్యార్థులు వికసిత్ భారత్-వికసిత ఆంధ్ర-2047 ధైర్య సాహసాల ప్రదర్శన దేశభక్తిని ప్రేరేపించి అందరినీ ఆకట్టుకుంది. సుండుపల్లె కేజీబీవీ పాఠశాల విద్యార్థులు రంగీలా... రంగీలా అంటూ చేసిన బృంద ప్రదర్శన, అదే పాఠశాలకు చెందిన విద్యార్థినులు పాడుదామా స్వేచ్ఛా గీతం ఎగరేయుదమా జాతీయ పతాకం నృత్యాలు ఆకట్టుకున్నాయి. మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థినులు ఘర్ ఘర్ తరంగా.. హర్ ఘర్ తిరంగా పాటకు చేసిన బృంద నాట్యం హుషారు కలిగించింది. గ్యారంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు పంతం పంతం.. సొంతం సొంతం నీదా నాదా సై అంటూ చేసిన నృత్యం దేశభక్తిని చాటుకున్న సైనికుల త్యాగాలను గుర్తు చేశాయి. కలకడ కేజీబీవీ పాఠశాల వారు జయహో.. జయహో అంటూ చేసిన బృంద ప్రదర్శన, రాయచోటి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు వందేమాతరం పాటకు చేసిన నృత్యాలు హుషారు గొలిపి దేశభక్తిని, సైన్యంలో మహిళలు చూపుతున్న ధైర్యసాహసాలను చాటింది. రాయచోటి గిరిజన గురుకుల పాఠశాలకు ప్రథమ బహుమతి, సుండుపల్లె కేజీబీవీ పాఠశాలకు ద్వితీయ బహుమతి, మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయ వారికి తృతీయ బహుమతి, కలికిరి సైనిక్ స్కూల్ పాఠశాలకు ప్రత్యేక బహుమతి అందజేశారు.

ఆకట్టుకున్న శకటాలు

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించేలా 2047 స్వర్ణ ఆంధ్ర విజన్ ప్రణాళిక 10 సూత్రాలపై అవగాహన కలిగించేలా వివిధ ప్రభుత్వ శాఖలు ప్రగతి శకటాలను ప్రదర్శించాయి. ఇందులో... గ్రేహౌండ్ బృందం, వజ్ర, మైన్ ప్రొటెక్టెడ్ వాహనాలు, రవాణాశాఖ వాహనం, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ప్రణాళిక, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, గృహ నిర్మాణ సంస్థ వాహనం, పరిశ్రమలు, పర్యాటకశాఖ వాహనం, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వాహనం, అటవీ, జలవనరులశాఖ వాహనం, జిల్లా పంచాయతీశాఖ వాహనం, ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వాహనం, ఉద్యాన శాఖ, సూక్ష్మ నీటి సాగు శాఖ వాహనం, రాయచోటి పులపాలక సంఘం వాహనం, సర్వేశాఖ వారి రియల్ టైం గవర్నెన్స్ శకటం, విద్యాశాఖ, సమగ్ర శిక్ష వాహనం, 108, 104 వాహనాలు శకటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి.



ద్వితీయ బహుమతి అందుకుంటున్న కేజీబీవీ పాఠశాల విద్యార్థులు


కడప పోలీసు పరేడ్‌లోని దృశ్యాలు



జెండాతో ఓ చిన్నారి ఆనందోత్సాహం



'ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం- పర్యావరణాన్ని కాపాడుదాం'లో భాగంగా ప్లాస్టిక్ భూత వేషధారణలో కడప నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుడు



డ్రోన్ల విన్యాసం

వేధిస్తున్న యూరియా కొరత

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- రైతుల తాకిడి తట్టుకోలేక గోడౌనుకు తాళాలు


ఉప్పరపల్లె గోడౌను వద్ద యూరియా కోసం ఎగబడ్డ రైతులు

చెన్నూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రబీ సీజనులో వరిసాగు చేసిన రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. వరి సాగుకు అవసరమైన యూరియా లభ్యం కాకపోవడంతో ఉన్నదాంతోనే సరిపెట్టుకోవాలని అధికారులు చెప్పడంతో రైతులు వ్యవసాయశాఖ అధికారులపై మండిపడుతున్నారు. రెండువారాల క్రితం మండలానికి యూరియా మంజూరు కాగా.. వ్యవసాయ సిబ్బంది రైతులు కోరినంత మేర పంపిణీ చేశారు. యూరియా తీసుకున్న రైతులు పలువురు వాటిని ఇళ్లల్లో నిల్వ పెట్టుకోవడం, కొందరు బస్తాపై రూ.60, 70కి అదనంగా అమ్ముకోవడం జరిగింది. దీంతో అవసరం ఉన్న కొందరు రైతులు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా, రెండురోజుల క్రితం రెండో దఫా మండలానికి మరో వంద టన్నుల యూరియా మంజూరైంది. ఇది చెన్నూరుకు 20టన్నులు, ఉప్పరపల్లె 20, రామనపల్లెకు 10, బయనపల్లె 10, కనుపర్తి 20, గ్రుర్రంపాడుకు 20 టన్నులు వచ్చింది. అయితే అధికంగా వరి సాగుచేసిన ఉప్పరపల్లె, చిన్నమాచుపల్లె రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. ఆదివారం ఉదయం ఉప్పరపల్లె గోడౌను వద్ద పలువురు రైతులు తమకు కావాలసిన మేర యూరియా ఇవ్వాలని పట్టుబట్టారు. వ్యవసాయాధికారులు తమ వద్ద ఎంత స్టాకు ఉందో దాన్ని ఎకరాకు బస్తా చొప్పున పంపిణీ చేస్తామనడంతో కొందరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న దఫా ఇష్టానుసారం యూరియా తీసుకెళ్లిన రైతులే ఇప్పుడు మళ్లీ అడుగుతున్నారని.. మా పరిస్థితి ఏంటని, మేం ఎక్కడికి వెళ్లి తెచ్చుకోవాలని రైతులు అక్కడ ఉన్న సిబ్బందిని నిలదీశారు. తమకు అవసరమైన యూరియా ఇవ్వాలని గట్టిగా నిలదీయడంతో సమస్య తీవ్రతరమవుతుందని భావించిన సిబ్బంది గోడౌనుకు తాళాలు వేసి సోమవారం పంపిణీ చేస్తామని చెప్పి వెళ్లారు.



రైతులందరికీ పంపిణీ చేయాలి

మేం అడిగిన మేర యూరియా ఇవ్వడం లేదు. ముందు దఫా ఇష్టానుసారం యూరియా తీసుకెళ్లిన రైతులే మళ్లీ తీసుకెళుతున్నారు. మా పరిస్థితి ఏంటి, వ్యవసాయాధికారులు మా అవసరం గుర్తించి రైతులందరికీ యూరియా పంపిణీ చేయాలి

- చింతకుంట నారాయణరెడ్డి, రైతు, ఉప్పరపల్లె



ఎక్కువ ధరకు తెచ్చుకుంటున్నాం

అవసరమైన యూరియా అందుబాటులో లేక లావు యూరియాను బయట ఎరువుల అంగళ్లల్లో తెచ్చుకుంటున్నాం, సన్న యూరియా ఇస్తే సర్దుబాటు అవుతుంది. గోడౌన్ వద్ద పరిస్థితి ఘోరంగా ఉంది. ఒక్కొక్కరు పదుల కొద్దీ బస్తాలు తీసుకెళుతున్నారు. మాలాంటి ఎకరా, రెండు ఎకరాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- రామసుబ్బారెడ్డి, రైతు, బుడ్డాయపల్లె

రైతుల అవసరం మేర పంపిణీ చేస్తున్నాం...



రైతులను ఇబ్బంది పెట్టడం మా ఉద్దేశ్యం కాదు. మండలానికి వంద టన్నులు వచ్చింది. ఆయా గ్రామాల్లో రైతులకు ఏ మేర అవసరమో పంపిణీ చేస్తున్నాం. రైతులు గొడవ పెడితే ఎలా.. పై అధికారుల ఆదేశాల మేరకు పంపిణీ చేస్తున్నాం

- శ్రీదేవి, మండల వ్యవసాయాధికారి

బ్రహ్మంగారి సన్నిధిలో విదేశీయుల సందడి



బ్రహ్మంగారిమఠం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారి మఠంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని ఆదివారం ఫ్రాన్స్, బెల్జియం దేశాలకు చెందిన 28 మంది విదేశీయులు దర్శించుకున్నారు. వీరికి ముందుగా పోలీసులు స్వాగతం పలికారు. అనంతరం దేవదాయశాఖ సిబ్బంది ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం విదేశీయులు దేవస్థానంలోని బ్రహ్మంగారి నివాస స్థలం, రచ్చబండ, పోలేరమ్మ గుడి, కక్కయ్యమఠంను సందర్శించారు. వీరి వెంట కానిస్టేబుల్ సూర్యనారాయణరెడ్డి, దేవస్థానం సిబ్బంది ఉన్నారు.

సెల్‌ఫోన్ చూడవద్దన్నందుకు బాలిక ఆత్మహత్య


విద్యార్థిని శ్రావ్య మృతదేహం

రాజంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు సెల్‌ఫోన్ చూడవద్దన్నందుకు ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి జరిగింది. రాజంపేట పట్టణం సాయినగర్‌లో శ్రీనివాసులు ఆచారి, భార్య సిద్దేశ్వరిలు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. ఇద్దరు మగ పిల్లలు కాగా శ్రావ్యకుమారి మూడో సంతానం(15). ఆ బాలిక రాజంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. శ్రావ్యకుమారి తరచూ సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తూ ఉండేది. దీంతో ఆమె తల్లి సెల్‌ఫోన్ ఎక్కువగా చూడవద్దని, ఆరోగ్యం దెబ్బతింటుందని గట్టిగా మందలించింది. దీంతో శ్రావ్య మనస్థాపానికి గురై స్నానానికి బాత్‌రూం వెళుతున్నాని చెప్పి బెడ్‌రూంకు గడియ పెట్టుకుని లోనికి వెళ్లింది. ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో శ్రావ్య తల్లి కిటికీలో నుంచి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకుని ఉండడాన్ని గమనించి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగులగొట్టి బాలికను హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ ఢీ... చిన్నారి దుర్మరణం


చిన్నారి మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, గ్రామస్థులు

నిమ్మనపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీ కొనడంతో రెండేళ్ల చిన్నారి దుర్మరణం చెందింది. ఎస్ఐ తిప్పేస్వామి కథనం మేరకు... కొండయ్యగారిపల్లి వాసి ఉప్పునోళ్ల సురేష్, పవిత్ర రెండో కుమార్తె గానవి(2) ఇంటి వద్ద ఆడుకుంటోంది. అదే గ్రామానికి చెందిన రెడ్డిబాషా ఖాన్ తన ట్రాక్టర్‌ను అతివేగంగా నడుపుతూ వచ్చి చిన్నారి మీద ఎక్కించాడు. దీంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు స్థానిక అస్పత్రికి తరలిం చగా డాక్టర్ పరిశీలించి చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం మృతదేహంతో కుటుంబీకులు, గ్రామస్థులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. వెంటనే పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్ రెడ్డి బాషాఖాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా అస్పత్రికి తరలించారు.

ప్రేమపేరుతో మోసం..యువకుడిపై కేసు

కాశినాయన, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో నమ్మించి మోసం చేసిన చంద్ర అనే యువకుడిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. మండలంలోని బాలాయపల్లె గ్రామానికి చెందిన చంద్ర ఓ యువతిని ప్రేమపేరుతో నమ్మించాడు. పెండ్లిచేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేశాడు. తీరా ఆయువతి పెండ్లి చేసుకోమని కోరడంతో నిరాకరించాడు. ఈవిషయంపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జంగావారిపల్లెలో మహిళ హత్య

కురబలకోట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగావారిపల్లె ఎస్సీ కాలనీలో ఆదివారం రత్నమ్మ(35) అనే మహిళ హత్యకు గురైంది. వివరాలిలా.. మండంలోని కురబలకోట పంచాయతీ జంగావారిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసులు కర్నాటక రాష్ట్రం చేలూరుకు చెందిన రత్నమ్మ(35)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఎస్సీ కాలనీలో కాపురం ఉంటున్నారు. కాగా వీరివురు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. శనివారం రాత్రి ఇరువురు మద్యం సేవించి గొడవపడ్డారు. దీంతో కోపోద్రేకానికి గురైన శ్రీనివాసులు కర్రతో కొట్టడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఆలయాల్లో దొంగతనాలు

ఖాజీపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని భూమాయపల్లె, సిద్దాంతిపురం గ్రామాల్లో చోరీలు జరిగాయి. ఆదివారం తెల్లవారుజామున భూమాయపల్లె సమీపంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయం, సిద్దాంతిపురం రామాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. భీమలింగేశ్వర ఆలయంలో సంవత్సరంలోపు ఎనిమిదిసార్లు దొంగతనం జరుగడంతో భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ మోహన్ మాట్లాడుతూ భీమలింగేశ్వర ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నాయని, సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డబ్బులు మాత్రం హుండీలో లేవని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సిద్దవటం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కడప- బద్వేలు రహదారి ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షరాభి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఆ రహదారి గుండా వెళుతున్న ఇద్దరు వ్యక్తులు గమనించి స్థానిక వైద్యశాలకు చికిత్సకు తరలించారు. అక్కడి డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

నక్సలిజం, ఉగ్రవాదంపై పోరు కొనసాగాలి

- సీఆర్పీఎఫ్ డీజీ అనుపమ్ శర్మ


సీఆర్పీఎఫ్ ప్రాంగణంలో జాతీయ జెండా వందనం చేస్తున్న అనుపమ్ శర్మ

కలికిరి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యతకు, భద్రతకు అతి పెద్ద ముప్పుగా పరిణమించిన నక్సలిజం, ఉగ్రవాదంపై పోరు కొనసాగించాల్సి వుందని స్థానిక సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలోని ఉగ్రవాద వ్యతిరేక, తీవ్రవాద నిరోధక శిక్షణా సంస్థ (సీఐఏటీ-3) ప్రిన్సిపాల్, డీజీ అనుపమ్ శర్మ పున రుద్ఘాటించారు. ఆదివారం సీఆర్పీఎఫ్ ప్రాంగణంలో నిర్వ హించిన గణతంత్ర వేడుకల్లో భాగంగా మొదట ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి పతాక వందనం చేశారు. అంతకు ముందు ప్రాంగణంలోని క్వార్టర్ గార్డ్ వద్ద అమర వీరుల స్మారక చిహ్నానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనుపమ్ శర్మ మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వం కోసం సీఆర్పీఎఫ్ అనేక త్యాగాలకు సిద్ధమైందన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఆర్పీఎఫ్ సైనికులు పొందిన రాష్ట్రపతి పోలీసు పతకం, శౌర్య చక్ర తదితర పురస్కారాల వివరాలను చదివి వినిపించారు. స్థానిక సైనిక పాఠశాలలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు.

177 పరుగుల ఆధిక్యతలో ఆంధ్రా జట్టు

కడప స్పోర్ట్స్, జనవరి 26, (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో శనివారం నుంచి ఆంధ్రా-పంజాబ్ జట్ల మధ్య జరుగుతున్న కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ అండర్- 23 మల్టీడేస్ నాలుగురోజుల క్రికెట్ మ్యాచ్‌లో ఆదివారం ఆంధ్రా జట్టు 177 పరుగుల ఆధిక్యతలో నిలిచింది. వివరాలిలా.... తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. కాగా ఆట రెండవ రోజైన ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 45.1 ఓవర్లలో కేవలం 119 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్రాజట్టు ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 85 పరుగులతో సాగుతోంది.

కువైట్ టు కొండూరు..

- స్నేహితుడి ఇంటికి అరబ్ షేక్



అట్లూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు గ్రామానికి ఆదివారం తన స్నేహితుడైన అట్లూరు రాజగోపాల్‌ను చూడడానికి కువైట్ షేక్ అబ్దుల్ రహిమాన్ యూసఫ్ వచ్చారు. రాజగోపాల్ 15 సంవత్సరాలుగా కువైట్‌లో తనతో ఎంతో స్నేహంగా, నమ్మకంగా ఫ్యామిలీలో ఒకడిగా ఉండేవారు. దీంతో స్నేహితుని పిలుపు మేరకు ఇక్కడకు వచ్చినట్లు షేక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కొండూరు గ్రామ ప్రజలు తప్పెట్లు, మేళాలతో ఘనస్వాగతం పలికారు.

లాయర్‌పై దాడి...

రైల్వేకోడూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టోల్‌గేటు వద్ద ఉన్న మొబైల్ షాపు దగ్గర లాయర్ కస్తూరి సురేష్ కారు పార్కింగ్ చేస్తుండగా తమ దుకాణం వద్ద పార్కింగ్ చేయవద్దని షాపు యజమాని చెప్పాడు. ఈవిషయమై ఇరువురు ఘర్షణ పడ్డారు. దీంతో షాపు యజమాని బంధువులు లాయర్‌పై దాడి చేశారు. ఈ సంఘటనపై లాయర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి ఘన సన్మానం


బాలయల్లారెడ్డిని సన్మానిస్తున్న ఆర్డీవో జాన్ ఇర్విన్, కమిషనరు మనోజ్‌కుమారరెడ్డి

చెన్నూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల సందర్భంగా ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డిని ఘనంగా సన్మానించారు. కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, నగర కమిషనరు మనోజ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దారు సరస్వతిలు ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి సన్మాంచారు. ఈసందర్భంగా సమరయోధుడు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలు అందరూ స్వేచ్ఛగా అనుభవించాలన్నారు. డీటీ వెంకటరమణ, మండల సర్వేయరు సోమశేఖర్, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ



కడప కలెక్టరేట్ జనవరి 26(ఆంధ్రజ్యోతి) 76వ గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఆదివారం జాతీయ పతాకాన్ని కలెక్టర్ డాక్టర్ చెరుకూరు శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులను ఎదిరించి ప్రాణ త్యాగాలు చేసి అమరులైన జాతీయనాయకులు, సమర యోధుల త్యాగాలను కలెక్టర్ కొనియాడారు. జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లె వద్ద రోడ్డు ప్రమాదం.. ఇద్దరి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన ఫయాజ్‌అలీ, మహేంద్ర

బి.కొత్తకోట జనవరి 26 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. బి.కొత్తకోట సీఐ జీవన్‌గంగనాథ్ బాబు తెలిపిన వివరాల మేరకు....

రాయచోటికి చెందిన ఫయాజ్‌అలీ (30), మహేంద్ర (25) ఓ టెంపోలో పీటీఎం మండలం రంగసముద్రం సమీపంలోని ఓ ఫౌల్ట్రీ ఫారం నుంచి కోళ్లను తీసుకెళ్లేందుకు వచ్చారు. టెంపోలో కోళ్లను వేసుకుని ములకలచెరువు మండలం పెద్దపాళ్యం క్రాస్ మీదుగా హైవేలో ప్రవేశించి అంగళ్ల వైపునకు వెళుతున్నారు. ఆదివారం తెల్లవారు జామున కోటిరెడ్డిగారిపల్లె వద్ద కదిరి నుంచి మదనపల్లె వైపు వెళుతున్న లారీ నిలిపి ఉండగా దానిని ఢీకొన్నారు. అతి వేగంతో వెళుతున్న టెంపో లారీ వెనుక వైపు నుంచి ఢీకొనడంతో టెంపో ఇరుక్కుపోయింది ఈ ఘటనలో టెంపో నడుపుతున్న డ్రైవర్, సహాయకుడు ఫయాజ్‌అలీ, మహేంద్రలు అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఎక్స్‌కేవటర్ సహాయంతో లారీలో ఇరుక్కుపోయిన టెంపోను విడదీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అశోక్‌నగర్‌లో సమస్యలు అనేకం

కడప నగర పరిధిలోని ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు మృగ్యం. ఇరుకు.. ఇరుకు సందులు.. ఎగుడు దిగుడు రోడ్లు... గందరగోళంగా మురుగునీటి వ్యవస్థ.. అడ్డదిడ్డంగా విద్యుత్ స్తంభాలు.. ఎటు చూసినా మురుగు, చెత్తాచెదారం.. అందులో పందుల స్వైరవిహారం.. దోమల నివాసం... ఇన్ని సమస్యలతో నిండిన ఆ ప్రాంతం మరేదో కాదండోయ్... 5వ డివిజన్‌లోని అశోక్‌నర్... ఆ వివరాలు ఇవీ...

- రోడ్డు వేయరు, మురుగుపారదు
- దోమలు, పందులకు నిలయం
- పట్టించుకునే వారు కరువు

డివిజన్ వివరాలు
కడప మున్సిపల్ కార్పొరేషన్
డివిజన్: 5
గృహాలు : 1800
జనాభా 7200 మందికి పైగా
కార్పొరేటర్ : బండి జయమ్మ



చెత్తాచెదారంతో నిండిన కాల్వ



దెబ్బతిన్న సచివాలయ భవనం

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 5వ డివిజన్ అశోక్‌నగర్‌లో పలు సమస్యలు నెలకొన్నాయి. అక్కడి ప్రజలు అసౌకర్యాల నడుమ కాలం వెల్లదీస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే నివాసం ఉంటున్నారు. ఇరుకు సందులు, మట్టిరోడ్లు, చినుకుపడితే చిత్తడే. డ్రైనేజీ వ్యవస్థ కూడా అంతంతమాత్రమే. కాల్వలు రోడ్లతో పాటు సమస్యలు పరిష్కరించాలని ఈ ప్రాంతవాసులు విన్నవిస్తున్నారు.

మురుగుతో కలవరం

అశోక్‌నగర్‌లో మురుగు కేసీ కెనాల్ ద్వారా వెళ్లాల్సిందే. ఇరుకు వీధుల్లోని పిల్లకాల్వల నుంచి వచ్చే మురుగు కేసీ కెనాల్‌లో కలుస్తుంది. ఈ ఇరుకు వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మురుగు పారే అవకాశం లేదు. కాల్వలు రోడ్డుకు సమాంతరంగా ఉన్నాయి. కాల్వల ఏర్పాటు చేసి వాటిపై బండలు వేయాలని స్థానికులు కోరుకుంటున్నారు. అలాగే కేసీ కెనాల్ ఏళ్ల తరబడి శుభ్రం చేయకపోవడంతో మురుగుతో నిండి ఉంది. నగరపాలక యంత్రాంగం పరిష్కారం చూపడం లేదు. కేసీ కెనాల్ ఆనుకొని పేదలు నివాసం ఉంటున్నారు. పూడికలు తీయకపోవడంతో మురుగుపారడం లేదు. ఈ ప్రాంతంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో పాటు దోమలు విజృంభణ ఎక్కువైంది. పూడికలు తీయించి కాల్వకు ఇరువైపులా గోడ నిర్మించాలి. దీనిపై కార్పొరేషన్ అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో ఎవరికీ అర్థం కాదు.

ఇరుకు వీధుల్లో మట్టి రోడ్లు



వీధుల్లోని రహదారులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారిపై మాత్రం సీసీరోడ్డు వేశారు. మిగతా వీధులన్నీ మట్టి రోడ్లే. చిన్నపాటి వర్షం కురిసిందంటే ఈ ప్రాంతం చిత్తడి చిత్తడే. సంపన్నుల ప్రాంతాలపై చూపే శ్రద్ధ మురికివాడ ప్రజలపై లేదు. ఎత్తు పల్లాల మట్టిరోడ్లు.. వీటిపై ద్విచక్రవాహనాల్లో వెళ్లలేని పరిస్థితి. అంగన్వాడీ కేంద్రం వద్ద అయితే మరీదారుణం. చిన్నారులు తిరిగే ఈ ప్రాంతంలో రోడ్డు గుంతలమయం. వర్షం వస్తే చిన్నారులు కేంద్రానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ సిమెంట్ రోడ్డు వేయాలని అశోక్‌నగర్‌వాసులు కోరుతున్నారు.



అశోక్‌నగర్‌లో అంగన్వాడీ కేంద్రం వద్ద రోడ్డు దుస్థితి ఇదీ...

నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంభాలు

ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారు. ఎక్కడైనా రోడ్డుకు ఒక పక్క మాత్రమే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తారు. అయితే ఈ ప్రాంతంలో గల ఒక వీధిలో రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇది చాలా ప్రమాదకరం. దీనిపై విద్యుత్ అధికారులు దృష్టిసారించి రోడ్డుకు ఒకవైపు ఏర్పాటు చేస్తే ప్రమాదాన్ని నివారించవచ్చు.

ప్రమాదపుటంచుల్లో సచివాలయ కార్యాలయం

ఇక్కడ సచివాలయ కార్యాలయం ప్రమాదపుటంచుల్లో ఉందని చెప్పాలి. పైన స్లాబ్‌కు ఉన్న బీమ్ ఎప్పుడు కూలిపోతుందో చెప్పలేని పరిస్థితి. కార్యాలయంలోనైతే మరీ అధ్వానం. స్లాబ్ గోడలు నెర్రెలు చీలి చెదలు పట్టుకున్నాయి. అలాగే కిటికీల డోర్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి. ఈ భవనం ఎప్పుడు కూలిపోతుందో అన్న పరిస్థితి అలాగే మరుగుదొడ్లు కూడా లేవు. ఈ ప్రాంత ప్రజలతో పాటు కార్యాలయ సిబ్బంది ఈ కార్యాలయంలోనే పనులు చేస్తుంటారు. దీనిపై కార్పొరేషన్ అధికారులు దృష్టిసారించి సచివాలయాన్ని ఈ భవనం నుంచి మార్చినట్లయితే ప్రజలకు, సచివాలయ సిబ్బందికి మేలు జరుగుతుంది.



కాల్వలో నిల్వ ఉన్న మురుగు

నీళ్లు పోయాలంటే భయమేస్తోంది



ఇరుకు వీధుల్లోని మురుగు చిన్న కాల్వ నుంచి వెళ్లాలి. ఇళ్ల మధ్య కాల్వ ఉండడంతో మురుగు తీయడానికి వెళ్లలేని పరిస్థితి. నీళ్లు పోయాలంటే మురుగు రోడ్డుపైకి వస్తుందని భయమేస్తోంది. మురుగు పోకపోవడంతో దోమలు, దుస్వాసనతో ఇబ్బంది పడక తప్పడం లేదు. సీసీ కాల్వల నిర్మాణం చేసి బండలు కూడా వేయాలి.

- శ్యామల లక్ష్మీప్రసన్న, అశోక్‌నగర్

మాదకద్రవ్యాల వాడకం అధికమవుతోంది



ఈ ప్రాంతంలో మాదకద్రవ్యాలు సేవించే మూకలు కూడా ఉన్నాయి. శివారు ప్రాంతం కావడంతో కేసీ కెనాల్‌కు ఆ పక్క ఖాళీ స్థలం ఉండడంతో అల్లరిమూకలు చేరి మత్తు పదార్థాలు సేవిస్తుంటారు. సాయంత్రం అయితే ఈ ప్రాంతంలో సంచరించాలంటే భయమేస్తోంది. మత్తు పదార్థాలు సేవించిన అల్లరి మూకలు ఏ సమయంలో ఏమి చేస్తారో అన్న భయంతో స్థానికులు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. ఈ ప్రాంతంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తే బాగుంటుంది.

- భాగ్యలక్ష్మి, అశోక్‌నగర్

కాల్వల్లో పూడికలు తీయాలి



కేసీ కెనాల్‌లో ఎన్నో ఏళ్ల నుంచి పూడికలు తీయని పరిస్థితి. మురుగు పారదు. దీంతో పందుల బెడద ఎక్కువైంది. అలాగే ఈ ప్రాంతంలో దుర్వాసనతో పాటు దోమలతో ప్రజలు అల్లాడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు కనీసం బ్లీచింగ్ కూడా వేయని పరిస్థితి. పూడికలు తీయించి కాల్వకు ఇరువైపులా గోడలు నిర్మిస్తే ఇక్కడ ప్రజలకు కొంత ఉపశమనం లభిస్తుంది.

- కరీమున్నీసా, అశోక్‌నగర్

మట్టిరోడ్లకు విముక్తి ఎప్పుడో...



ఈ ప్రాంతంలో ఇరుకు వీధులు మట్టిరోడ్లే. ఎత్తు పల్లాలతో రోడ్లు దర్శనమిస్తుంటాయి. సాధారణ రోజుల్లో కూడా ఈ రోడ్లపై ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. అదే చిన్నపాటి వర్షం పడిందంటే పాదచారులు కూడా వెళ్లలేని పరిస్థితి. కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. పట్టించుకోవడం లేదు. ఏమి చేయాలో తెలియని పరిస్థితి.

- బేగం, అశోక్‌నగర్



అశోక్‌నగర్‌లో ఇరుకుగా ఉన్న సందు



రోడ్డుకు కుడి వైపు ఒకటి ఎడమ వైపు ఒకటి ఉన్న కరెంటు స్తంభాలు

మూలవంక బ్రిడ్జి మూసివేత

సికెదిన్నె, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని మూలవంక పాత బ్రిడ్జిని అధికారులు ఆదివారం మూసేశారు. బ్రిడ్జి నిర్మించి 100 ఏళ్లు పూర్తయిందని, బ్రిడ్జి నాణ్యతను పరీక్షించి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని మూసేసినట్లు ఈఈ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు ఎంతో విలువైనవని, ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రమాదం జరుగకుండా ఉండాలని బ్రిడ్జిని మూసివేస్తున్నట్లు తెలిపారు. కాగా ఓ ప్రముఖ వెంచర్ నిర్వాహకులు అడ్డగించడంతో పోలీసు రక్షణలో గోడను కట్టి బ్రిడ్జిని మూసివేశారు.

పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుందాం



కలెక్టరేట్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



సాయిబాబా స్కూల్‌లో జాతీయ పతాకానికి వందన సమర్పణ చేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



శాంతినికేతన్ పాఠశాలలో గణతంత్ర వేడుకల్లో విద్యార్థులతో ఇలియాస్‌రెడ్డి

కడప కలెక్టరేట్/ఎడ్యుకేషన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరు శ్రీధర్ అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, పాల్గొన్నారు. వైవీయూలో వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

గురుకుల విద్యాపీఠ్‌లో...

కడపలోని గురుకుల విద్యాపీఠ్ పాఠశాలలో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాఠశాల డైరెక్టర్ ఎ.వీరకుమారి, సీఈఓ ఏఎల్ వివేకానంద, ప్రిన్సిపాల్ ఎన్.మునిచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

శాంతినికేతన్ పాఠశాలలో...

కడపలోని శాంతినికేతన్ పాఠశాలలో గణతంత్ర వేడుకల సందర్భంగా వ్యవస్థాపకుడు ఇలియాస్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల డైరెక్టర్ ఫిలోమిన పాల్గొన్నారు.

వికాస్ హైస్కూల్లో...

కడపలోని అక్కాయపల్లె వికాస్ హైస్కూల్లో గణతంత్ర వేడుకల సందర్భంగా కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ఫాతిమా పాల్గొన్నారు.

సాయిబాబా పాఠశాలలో...

కడపలోని అక్కాయపల్లె సాయిబాబా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గణతంత్ర వేడుకల సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ శ్రీదేవి, వైస్ చైర్మన్ సాయి సుధీర్‌కుమార్‌రెడ్డి పాల్గొని జండా ఆవిష్కరించారు.

వేంపల్లె చైతన్య హైస్కూల్‌లో..

వేంపల్లె చైతన్య హైస్కూల్లో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, ఉషాకిరణ్ హైస్కూల్లో కరస్పాండెంట్ రమణారెడ్డి, స్వామివివేకానంద హైస్కూల్లో కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి, శ్రీనివాస హైస్కూల్లో కరస్పాండెంట్ కేశవులు ఆధ్వర్యంలో జండా పండుగ ఘనంగా జరిగింది.

శ్రీ వివేకానంద హైస్కూల్‌లో...

సింహాద్రిపురంలో శ్రీ వివేకానంద హైస్కూల్‌లో ఎంఈఓ ఓబులేసు పతాకావిష్కరణ చేశారు. క్రీడాపోటీలలో విజేతలకు ఎంఈఓ చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు.



వేంపల్లె చైతన్య హైస్కూల్లో చిన్నారులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి



వేంపల్లె ఉషాకిరణ్ హైస్కూల్లో బహుమతులు పొందిన విద్యార్థులతో కరస్పాండెంట్ రమణారెడ్డి



గణతంత్ర వేడుకల్లో విద్యార్థులతో ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర్లు



జాతీయ పతాకానికి వందన సమర్పణ చేస్తున్న వికాస్ హరికృష్ణ



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో సింహాద్రిపురం వివేకానంద హైస్కూల్ విద్యార్థులు



గణతంత్ర వేడుకల్లో కేఎస్ఆర్ఎం అధినేత చంద్ర ఓబుళ్‌రెడ్డి(నాని)



అన్నమాచార్యలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న చొప్పా యల్లారెడ్డి, డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జనసేన నేత తుంగా రమణయ్య తదితరులు

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక లేపాక్షి డిగ్రీ కళాశాలలో కోడ్ వర్క్స్ ఎడ్యుటెక్ సర్వీసెస్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 86 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి తెలిపారు. స్టీల్ ఇంటర్న్ లిమిటెడ్ ప్రనిధులు బిజినెస్ డెవలప్‌మెంట్స్ అసోసియేట్ ఉద్యోగాలకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన 86 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా లేపాక్షి డిగ్రీ కళాశాలకు చెందిన 30 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి సంవత్సరానికి రూ.4.20 లక్షలు వార్షిక వేతనం, ఇన్‌సెంటివ్‌లు ఉంటాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ రాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఐడీపీఎస్‌లో రిపబ్లిక్‌డే ఉత్సవాలు



చాపాడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి, డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ మన రాజ్యాంగం 1950 జనవరి 26వ తేదీ నుంచి అమలులోకి వచ్చిందన్నారు.

హనుమాన్‌నగర్‌లో సమస్యల తిష్ఠ

● దారుణంగా సీసీ రోడ్లు ● మడూరు కాలువకు అప్రోచ్ రోడ్డు వేయక ఆక్రమణలు ● ఏళ్ల తరబడి పట్టించుకోని అధికారులు

ప్రొద్దుటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 39వ వార్డు హనుమాన్‌నగర్‌లో సమస్యలు తిష్ఠ వేసి ఉన్నాయి. ఈ వార్డులో 4500 వందల మంది జనాభా వున్నారు. 3400 మంది ఓటర్లు వున్న మున్సిపాలిటీలోని పెద్ద వార్డుల్లో ఇది ఒకటి. ఇక్కడ చేనేతలు అధికంగా వున్నారు.వీరితో పాటు బేడ బుడగ జంగాలు ఎక్కువ సంఖ్యలో వున్నారు. ఈ వార్డు మున్సిపాలిటీలోని మురుగు వాడల జాబితాలో వుంది. ఈ వార్డులో కొన్నేళ్లుగా సీసీ రోడ్లు అధ్వానంగా వుండి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు వున్నా యి.అనేక సార్లు వాహనాల మీద వెళుతూ ప్రమాదాల బారిన పడ్డారు. ముఖ్యంగా హనుమాన్‌నగర్ ప్రధానవీధి మాస్టర్ ప్లాన్‌లో 60 అడుగుల రోడ్డు ఇది.కానీ నేటికీ అది 10 నుంచి 18 అడుగుల మేర మాత్రమే ఇరుకుగా వుంది. ఈ రోడ్డు పూర్వం బొల్లవరం నుంచి రామేశ్వరం పెన్నానదికి వెళ్లే ప్రధాన రహదారి. కాలక్రమేణ ఈ రోడ్డు పూర్తిగా ఆక్రమణలకు గురవుతూ వస్తోంది. రెవెన్యూ రికార్డుల మేరకు కూడా ఈ రోడ్డు లేకుండా చాలా వరకు ఆక్రమించారు. ఈ రోడ్డువిస్తరణకు గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్ ఇచ్చారు.కానీ స్థానికంగా ప్రజలు వ్యతిరేకించారు. అంతేకాకుండా మున్సిపల్ ఎన్నికలు రావడంతో విస్తరణ పనులు నిలిపివేశారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. నాలుగు ఏళ్లుగా ఇదే పరిస్థితి వున్నది. కొన్ని వీధుల్లో కనీసం మెటల్ రోడ్లులేవు. కాలువలు లేని పరిస్థితి వున్నది. హనుమాన్ టెంపుల్ వీధిలో ఏడేళ్ళక్రితం పైపులైను పనులు చేసి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ వీధిలో సీసీ రోడ్డు నిర్మించాల్సివుంది.మడూరు కాలువ వెంబడి రక్షణ గోడలతో పాటు అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో కాలువ వెంబడి ఆక్రమణలు పెరిగిపోయాయి. కాలువ స్థలం ఆక్రమిం చి భవనాలు నిర్మించారు. గతంలో ఒకసారి ఆక్రమణలకు మార్కింగ్ ఇచ్చినా అక్కడ అక్రమ కట్టడాలు వెలిశాయి.టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలోపం వుందని స్థానికులు వెల్లడిస్తున్నారు. కాలువ అప్రోచ్‌రోడ్డును ఏకంగా బ్లాక్ చేసేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఈ రోడ్డుకు అడ్డంకులు తొలగించి సీసీ రోడ్డు నిర్మిస్తే హనుమాన్‌నగర్ నుంచి గాంధీరోడ్డుకు శివాలయం రోడ్డుకు కనెక్టివిటీ పెరుగుతుంది.దీంతో ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు మెరుగు పడతాయి.కానీ అధికారులు ఈ సమస్యల పై దృష్టి పెట్టి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ఆక్రమణకు గురైన మడూరు కాలువ అప్రోచ్‌రోడ్డు



ఆంజనేయుని దేవళం వీధిలో రోడ్డు దుస్థితి





60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు దుస్థితి



రక్షణగోడ, అప్రోచ్ సీసీ రోడ్డులేని మడూరు కాలువ

ఏడేళ్లుగా ఇబ్బందులుపడుతున్నాం



ఏడేళ్ళ క్రితం టీడీపీ ప్రభుత్వంలో తాగునీటి పైపులైను వేసి నీటి సమస్య తీర్చారు.అప్పుడు తీసిన పైపులైను గోతులతో రోడ్డు తీవ్రంగా దెబ్బతింది.ప్యాచ్‌లు వేసినా వుండలేదు. అధ్వానంగా వుంది. తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం.రోడ్డు వేయాలని కోరుతున్నాం.

కలిశెట్టి ప్రసాద్, హనుమాన్ టెంపుల్ వీధి

ప్రజలందరి ఆమోదంతో విస్తరణ చేపట్టాలి



కొన్నేళ్లుగా ఈ వీధి విస్తరణ పనులు నిలిచిపోయాయి.ప్రజలందరికీ ఆమోదంతో రోడ్డును విస్తరించి కొత్తరోడ్డు నిర్మించాలి. చాలా కాలంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. బొల్లవరం జమ్మలమడుగు మెయిన్ రోడ్డుకు అనుసంధానం చేయాలి.

శీలా రమాదేవి,హనుమాన్‌నగర్ మెయిన్‌రోడ్డు

మున్సిపల్ అధికారులు సహకరించాలి



39 వవార్డు చేనేతలు అధికంగా వున్న బీసీవార్డు అలాగే హనుమాన్ టెంపుల్‌రోడ్డు తోపాటు కొన్ని వీధులకు కనీసం మెటల్ రోడ్లు అయినా వేయాలి.మడూరుకాలువ అప్రోచ్ రోడ్డు నిర్మించకపో వడంతో కాలువస్థలాలు ఆక్రమించి కట్టడాలు వెలిశాయి.

చింపిరి అనిల్,39 వవార్డు కౌన్సిలరు

ఘనంగా గణతంత్ర వేడుకలు

జమ్మలమడుగు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం ఉదయం ఆర్డీవో సాయిశ్రీ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన గణతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆర్డీవో సాయిశ్రీ త్రివర్ణ పతాకాన్ని (జాతీయజెండా) ఎగురవేశారు. అలాగే ముద్దనూరు రోడ్డులోని రిపబ్లిక్ క్లబ్ సొసైటీ ఆధ్వర్యంలో గోనా పురుషోత్తంరెడ్డి, బిందు నాగేశ్వరరెడ్డి, తదితరులు ముఖ్య అతిథి డాక్టర్ ఎం.ఎల్.నారాయణరెడ్డిజెండాను ఎగురవేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ క్లబ్ సొసైటీ వారు డాక్టర్లు చంద్రకళ, సుజాత, సుధాకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, కల్యాణ్, రంగస్వామి, రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.

బద్వేలు/బద్వేలు రూరల్/బద్వేలు టౌన్..: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఆర్డీవో చంద్ర మోహన్,ఆర్టీవో కార్యాలయంలో మోటారు వాహనాల తనిఖీ అధికారి శేఖర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. బద్వేలు నియోజకవర్గవ్యాప్తంగా గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు పట్టణంలో రిపబ్లిక్ డే వేడుకలను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఝాన్సీ రాణి, భారత మాత,అల్లురిసీతారామరాజు,రాణి రుద్రమ దేవిల వేషధారణలో ఉన్న విద్యార్థులతో ఎమ్మెల్యే ఫొటోలు దిగారు.మేధా కళాశాల విద్యార్థులు,హైస్కూల్ విద్యార్థులు బ్యాండు మోగిస్తు ఎమ్మెల్యేకు ఘన స్వాగ తం పలికారు. రాయల్ కూడలి వద్ద 101 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను పుట్టా ఆవిష్కరించారు. తరువాత కడప రోడ్డులో అంబేద్కర్,యోగివేమన విగ్రహాలను,బద్వేల్ రోడ్డులో పొట్టి శ్రీరాముల విగ్రహం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబర్ యాపరాల,ఏపీ రవీంద్ర,చిన్న,ధనపాల జగన్, యుగంధర్,రవి, బండి అమర్‌నాథ్,తుపాకుల రమణ, ఆకుల క్రిష్ణయ్య,ఆర్ శ్రీనివాసులు,పాలమాబు, పిచ్చ పాటివీరారెడ్డి, దాసరి చిన్న బాబు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు...: రిపబ్లిక్ డే సందర్భంగా ప్రొద్దుటూరులో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు.ఆదివారం టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, వీఎస్ ముక్తియార్, ఘంటశాల వెంక టేశ్వర్లు, మాజీ కౌన్సిలర్లు గంజికుంట ఆంజనేయులు, అమీర్ బాషా సోమా బాలయ్య, తాటిశ్రీను, ,కామిశెట్టి బాబు, జయశంకర్ మాజీ సైనికోద్యోగులుపాల్గొన్నారు. కాగా ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పాల్గొన్నారు.



బద్వేలులో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎంవీఐ శేఖర్‌రావు



జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న దేవగుడి నారాయణరెడ్డి



మైదుకూరు.. దేశ నాయకుల వేషధారణతో ఉన్న విద్యార్థులతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



ప్రొద్దుటూరు టీడీపీ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సీనియర్ డాక్టర్ చంద్రకళ, రిపబ్లిక్ క్లబ్ సొసైటీ సభ్యులు